**ఈవారం కథ**

# జాలి

– రమాదేవి. జాస్తి



పనిలో కొచ్చిన లక్ష్మమ్మకి ముఖ్యా, మొహమూ వాచి పోయి వుండటం చూసి ఆశ్చర్యపోయింది సుభద్ర.

'ఏమైంద'ని సుభద్ర అడగ్గానే, ఇంక లక్ష్మమ్మకి దుఃఖం కట్టలు తెంచుకుంది.

మామూలు కథే – అల్లుడు బాగా తాగొచ్చి కూతుర్ని చితకబాదుతుంటే అడ్డుపడిందట. అందుకని ఆమెక్కూడ నాలుగు తగలనిచ్చేడు. మోచేతి దగ్గర కూడ బాగా వాచిపోయింది.

"అయ్యయ్యో! వాడి మొహం మండా, పెద్దదానివి, అత్తవని కూడా చూడకుండా, నీ మీద చెయ్యి చేసుకోవడం ఏమిటే?" సుభద్ర బాధపడిపోతూ లేచి వెళ్ళి వేడిగా కాఫీ, వొళ్ళు నొప్పులు తగ్గటానికి 'టాబ్లెట్లూ' తెచ్చి యిచ్చింది.

లక్ష్మమ్మ ముక్కుతూ, మూలుగుతూనే పని చేసింది. చేస్తున్నంత సేపూ అల్లుడి ఆగడాల గురించీ, కూతురి కష్టాల గురించీ, చూడలేక తన ఏడుపు గురించి – చెప్తూనే వుంది. చెప్తున్నంతసేపూ కళ్ళు తుడుచు కొంటూనే వుంది.

వింటున్న సుభద్రకి గుండె కరిగి నీరైపోతూనే వుంది. ఛీ,ఛీ, ఏం ఆడ బ్రతుకులో! ఎక్కడ చూసినా ఇంతే. ఎంత అందం, చదువు, ఆస్తి – వున్నాసరే – ఇవేమీ లేకున్నా సరే – మొగుళ్ళ చేతుల్లో బాధలు తప్పవు. 'కిరాతకంగా భార్యని చంపిన భర్త' అన్న వార్త ఏదోమూలన చోటుచేసుకోకుండా పేపరొచ్చిన రోజున్నదా? బీదా, గొప్పా తేడాల్లేకుండా అన్ని

కుటుంబాల్లోనూ ఇదే వరసయ్యె.

బోలెడంత కట్నం, యిచ్చి మరీ బంగారం లాంటి పిల్లని ఏరికోరి 'డాక్టర్' కిచ్చి పెళ్ళిచేసేరు తన పిన్ని కూతుర్ని ఎంత అందమైంది తను? ఏం లాభం. ఆ డాక్టర్ మరో లేడీ డాక్టర్తో చిన్నిల్లు పేట్టేసి – అప్పుడప్పుడొచ్చి మొగుడి అధార్టీ చెలాయించిపోతుంటాడు. తమ కుటుంబాల్లో 'ఆడది' అణిగిమణిగి వొద్దికగా కాపురాలు చేసుకోవడమే తప్ప భర్తలకి ఎదురుతిరగడమే తెలియదాయె. అందుకే అది భరిస్తోంది. ప్చ్, ఏ స్త్రీ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?

సుభద్రకి మనసంతా వికలమై పోయింది. తన మొగుడు మాత్రం తక్కువ తిన్నాడా? 'భర్త' గుర్తుకు రావడంతోనే సుభద్ర వులికిపడింది. అరికాళ్ళలో, అరిచేతుల్లో చెమట పట్టేసింది. ఉదయం వెళ్ళిపోయి, రాత్రి ఏ పన్నెండు గంటలకో ఇల్లు చేరుతాడు కాబట్టి పగలంతా సుఖంగానే వున్నట్లు అన్పిస్తుంది. అతగాడొచ్చినప్పటి నుండీ మళ్ళీ బయటి కెళ్ళేవరకూ ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని నిముషమొక యుగంగా గడపాల్సిందే. అతడికే క్షణంలో, ఎందుకు కోప మొస్తుందో తెలియదు. ఎప్పుడే వస్తువు గాలిలో ఎగిరొచ్చి తనకెక్కడ తగుల్తుందో అంతకన్నా తెలియదు. లక్ష్మమ్మ కూతురికీ, తనకీ తేడా ఏమీలేదు, వొక్క 'డబ్బు' తప్ప. తను బయటికి చెప్పకుని ఏడవను కూడా ఏడవలేదు వాళ్ళ మాదిరిగా – పరువు కోసమని.

సుభద్ర నిట్టూర్చింది. లక్ష్మమ్మ వెళ్ళేప్పుడు రాత్రి మిగిలిన కూరలు, ఆమె కూతురి కోసం రెండు పాత చీరలు, జాకెట్లు యిచ్చిపంపింది. డాక్టరు దగ్గరకెళ్ళి చూపించుకోమని పాతిక రూపాయలు కూడా చేతిలో పెట్టింది.

"ఎంత జాలి గుండె ఈ తల్లిది?!" లక్ష్మమ్మ సంతోషపడ్తూ వెళ్ళిపోయింది, దెబ్బలు నొప్పి తాత్కాలికంగా మర్చిపోయి.

* * * * *

"నువ్వు చెప్పేది నిజమా" సుభద్ర నమ్మలేనట్లు అడిగింది. లక్ష్మమ్మ ఆ రోజు చాలా సంతోషంగా వుంది. 'పంచాయతీ' పెట్టించి కూతురికి, అల్లుడికి తెగతెంపులు చేయించిందట. "ఆ ఎదవతో ఎన్నాళ్ళు యేగాలి? ఆడి మొహమ్మీద పెప్పుచ్చుకొట్టినట్టు మళ్ళీ మనువు సేత్తా నా కూతురికి." అంది లక్ష్మమ్మ ధీమాగా. "మళ్ళీ పెళ్ళా? ఇద్దరు బిడ్డల తల్లి నెవడు చేసుకుంటాడు? మరో రెండేళ్ళల్లో ఆడపిల్ల ఈడేర్తుంది కూడాను." సుభద్ర విస్తుపోయింది. "మా బంధువులోడే, ముందుగా ఆడే అడిగేడు. అన్న కొడుకని బెమపడి ఈడికిచ్చి సేసినా. అందుకే బాగానే బుద్ధి పెప్పేడు నాకు. ఇప్పుడు కూడ మళ్ళీ పాతోడే అడుగుతున్నాడు. నా కూతురు సరేనంది." లక్ష్మమ్మ ముఖం వెలిగిపోతోంది, అల్లుడి పీడ విరగడైనందు క్కాబోలు

సుభద్రకీ విషయం మింగుడు పడటం లేదు. "రేపు నీ మనవరాలు పెద్దదయ్యాక వాడు దీని మీద కూడా కన్నేస్తే ఏం చేస్తారే? అయినా, యిద్దరు పిల్లల తల్లికి మళ్ళీ పెళ్ళేమిటే?" మందలించబోయింది.

> **'టెజ్‌కట్లిపోక'**
>
> 800 సంవత్సరాల క్రితం మెక్సికోలో నివసించిన ఒక దేముడిని ఆరాధించే అజ్టెక్టులుల దైవం పేరు. ఈ దేవుడికి మనిషి గుండె ఇష్టం. అందుచేత అజ్టెక్టులు ప్రతి ఏటా ఒక యువకుడిని బలి ఇచ్చి ఈ దేవుడి కటాక్షం పొందేవారు. బలికి ఒక చక్కటి యువకుణ్ని ఎన్నుకుని అతడికి 12 నెలలపాటు సకల భోగాలు అనుభవించడానికి అన్ని వసతులు కల్పించేవారు. 12 వ నెలలో అతడిని నలుగురు సుందరాంగులతో గడిపే ఏర్పాట్లు చేసేవారు.
>
> గడువు తీరగానే ఆ యువకుడిని బలిపీఠం మీదకి నడిపించి వెల్లకిలా పడుకోబెట్టి ఒక కత్తితో అతడి ఛాతీని చీల్చి, గుండెపెకోసి 'టెజ్‌కట్లిపోక' దేవుడికి నైవేద్యం పెట్టి వేడుకలు జరిపి ఆనందించేవారు.
>
> – దేవీరమణ

"శ,శ, వూరుకోమ్మా అయ్యేం పాడు మాటలు? ఆడికది బిడ్డ వరస కదా? మనుసుల్లో అందరూ సన్నాసెదవలే వుండరు. కన్న కూతర్ల మీద పెయ్యేసిన ఎదవముండ కొడకుల్లేరా? అందుకని సెప్పి పెళ్ళిళ్లు మానేత్తున్నారా? నా కూతురికేంతక్కువైందని మోడల్లే బతకాల? ఈడు వువ్వుల్లో పెట్టి సూసుకుంతానంటున్నాడు. ఎందుక్కాదనాలె? పాలు తాగితే మూతి కాలిందని మజ్జిగ తాగడానిక్కూడ బయపడితే బతికేదెట్టనమ్మా? మీ సినీమాల్లో, కతల్లో మాదిరి బతకాల్నంటే మాకెట్ట వదుసుద్ది? వువ్వూ,కారం, తినే శరీరమయ్యె, మంచికీ, సెడుకీ తోడూ నీడా కావొద్దా?" లక్ష్మమ్మ వుపన్యాసమే యిచ్చింది.

సుభద్రకి తన దూరాలోచన లక్ష్మమ్మ ఏమీ లక్ష్యపెట్టక పోవడం కొంచెం కూడా నచ్చలేదు. "లెక్చర్లు దంచుతోంది, చిల్లరముండ – వాళ్ళకేం నీతా, జాతా? రోజుకో పెళ్ళయినా చేసుకోగలరు. వీడు కూడ రోజూ యిద్దర్నీ చితకబాదితే కాని బుద్ధిరాదు తల్లీ కూతుళ్ళిద్దరికీ, 'పోయినవాడే నయం' అనుకోవాలి అప్పుడు," కసిగా అనుకుంది సుభద్ర మనసులో

ఇంకా వుత్సాహంగా కాబోయే అల్లుడి ముచ్చట్లు చెప్తున్న లక్ష్మమ్మని "చాల్చాలు, వాగుడాపి బట్టలు శుభ్రంగా వుతుకు. ఎక్కడ మురికి అక్కడే వుంటోంది." అని విసుక్కుంది సుభద్ర.

సుభద్ర వూహించుకున్నట్లు గాక, లక్ష్మమ్మ అల్లుడు నిజంగానే బాగా చూసుకుంటున్నాడు భార్యని. లక్ష్మమ్మ మాటల్లోనే చెప్పాలంటే – వాళ్ళిద్దరూ చిలకా, గోరింకల్లా చూడ ముచ్చటగా సుఖంగా, సంతోషంగా వుంటున్నారు. పిల్లల్ని కూడ తన బిడ్డల్లానే చూస్తాడట ప్రేమగా.

"ఛ, యిలాంటి చవట వెధవలు కూడ వున్నారా? ఎవడికో పుట్టిన పిల్లల్ని వీడు బాగా చూసుకోవడం ఏమిటి?" అని ఈసడించుకుంది సుభద్ర లోపల్లోపల. రాన్రాను లక్ష్మమ్మ కబుర్లు భరించడం కష్టమైపోయింది సుభద్రకి.

పని శుభ్రంగా చెయ్యడం లేదన్న సాకుపెట్టి తీసేసింది. పన్లోనుండి సుభద్ర ఎందుకు మారిపోయిందో, తననేరం ఏమిటో అర్థం కాలేదు లక్ష్మమ్మకి.

"సెయ్యడానికి సత్తువుండాలేకాని యిళ్ళకు కరువేటి?" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

* * *

"ఒట్టి యెదవ సచ్చినాడమ్మా, పెళ్ళాం బిడ్డలకి కూడెట్టటం సేతకాదు కాని జలసాలకి మాత్రం తక్కువ లేదు"

బూరెలా పొంగిన బుగ్గని తడుముకుంటూ – ఇల్లు చిమ్ముతోంది కొత్త పనిమనిషి సాయమ్మ.

సుభద్ర బాధపడ్తో వింటున్నది. ఆమె చూపుల్లో 'జాలి' గంగానదిలా ప్రవహిస్తోంది.

"ఆడవాళ్ళ బ్రతుకులింతే – వీళ్ళ నుద్ధరించడానికి మళ్ళీ ఏ వీరేశలింగమో, రాజా రామ్మోహనరాయ్ వంటి పుణ్యాత్ములో మళ్ళీ వుట్టాలి. అంతవరకూ ఇంతే–"

సుభద్ర నిట్టూర్చింది!